

పువ్వాళ్ల అభినందన సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




# మనం ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

www.manamepaper.com సోమవారం | 25 | మే | 2026 | పేజీలు : 12


# జూన్ 2 నుండి ఇందిరమ్మ బీమా

- పేదరికంపై కాంగ్రెస్ సమరం రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా రక్షణ
- మహిళా సంఘాలకు రూ. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు
- సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లతో ప్రజా సంక్షేమమే లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వివరాలు మెయిన్‌లో..

## సుడా, గ్రంథాలయాల ద్వారా

# మెరుగైన సేవలందించాలి



**ఖమ్మం :** సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ ఛైర్మన్ ఖాదర్ బాబా అభినందన సభ ఆదివారం ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. వివరాలు 3లో

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- కార్యకర్తల త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మర్చిపోదు
- సంక్షేమ పథకాలను గ్రామ, గ్రామానికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపు
- సుడా, జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ లకు నిర్వహించిన అభినందన సభలో పాల్గొన్న డిప్యూటీ సీఎం, మంత్రి తుమ్మల

# పంట అవశేషాలను కాల్చవొద్దు

- గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలి....
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ఖమ్మం జిల్లాలో సజావుగా ధాన్యం కొనుగోళ్లు
- గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో ధాన్యం చెల్లింపులు, ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డిప్యూటీ సిఎం

వివరాలు 2లో..





# కాంగ్రెస్, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు

- కాళేశ్వరం సీబీఐ విచారణ ఓ ప్రహసనం
- ధాన్యం, మొక్కజొన్న రైతులపై కక్షగట్టిన కాంగ్రెస్ సర్కార్.
- రూ.10 లక్షల కోట్ల కేంద్ర నిధులపై కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు
- ఖమ్మం గడ్డపై కాషాయ జెండా ఎగరేయండి
- కేంద్ర బలంతో జిల్లాను నంబర్ వన్ చేస్తాం
- మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావు

వివరాలు 2లో..

# పంట అవశేషాలను కాల్చవొద్దు....

## గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలి....

## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

## ఖమ్మం జిల్లాలో సజావుగా ధాన్యం కొనుగోళ్లు

## గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో ధాన్యం చెల్లింపులు

## ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డిప్యూటీ సీఎం

**ఖమ్మం, మే 24(మనం బ్యూరో):** పంట అవశేషాలను కాల్చవద్దని గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఖమ్మం కలెక్టరేట్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పాల్గొన్నారు. డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ యాసంగి ధాన్యం కొనుగోళ్లను అనేక సవాళ్ల మధ్య కూడా విజయవంతంగా కొనుగోలు నిర్వహించిన పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ ఏడాది భారీ స్థాయిలో వరి దిగుబడి వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల మంత్రివర్గం సన్‌ఫ్లవర్ పంట కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని, అధికారులు సమర్థవంతంగా పనిచేశారని డిప్యూటీ సీఎం ప్రశంసించారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 1,23,560 మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా, అందులో 1,12,922 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ఉందని, మరో 16 వేల టన్నుల వరకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గతంలో రైతులకు ధాన్యం చెల్లింపులు నెలల తరబడి పెండింగ్లో ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని, కానీ ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ పాలనలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గంటల వ్యవధి లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధిలో వాయు కాలుష్య నియంత్రణ కీలకమని, పంట అవశేషాలను పొలాల్లో కాల్చడం కూడా వాయు కాలుష్యానికి ప్రధాన కారణమని, అంతేగాకుండా పక్క పొలాలకు మంటలు వ్యాపించి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. ప్రతి గ్రామంలో పంట అవశేషాలను కాల్చకుండా టామ్టామ్ ద్వారా రాబోయే 15 నుంచి 30 రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత కూడా ఎవరైనా పంట అవశేషాలను కాల్చేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవలన్నారు. మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి మాట్లాడుతూ మే చివరి నాటికి ధాన్యం కొనుగోలు వంద శాతం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా ఉండే హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వంద శాతం పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేసిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయాలని మంత్రి పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మంత్రివర్గం సన్‌ఫ్లవర్ కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అన్నారు. చివరి గింజ వరకు పంట కొనుగోలు జరిగేలా చూడాలని, వరి కొయ్యలను కాల్చకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# టియూడబ్ల్యూజె(ఐజెయూ) జిల్లా అధ్యక్షులుగా రత్నం

## కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా శ్రీనివాసరావు



**కొత్తగూడెం, మే 24(మనం న్యూస్):** టియూడబ్ల్యూజె(ఐజెయూ) జిల్లా అధ్యక్షులుగా జివి రత్నం, ప్రధాన కార్యదర్శిగా జునుమాల రమేష్, కోశాధికారి శీమకుర్తి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తగూడెంలోని క్లబ్‌లో ఆదివారం జరిగిన జిల్లా మూడో మహాసభలో ప్రతినిధులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాడాతామన్నారు. జిల్లాలో యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ఖాదర్ బాబాకు టీడబ్ల్యూజేఎఫ్ సన్మానం



**ఖమ్మం, మే 24(మనం న్యూస్):** ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన ఎండీ ఖాదర్ బాబాను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ – హెచ్ 2843) ఖమ్మం జిల్లా కమిటీ సన్మానించింది. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చైర్మన్ చాంబర్ లో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, జర్నలిస్టు అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు నలుబోల మధులత, అర్షద్, యూనియన్ నాయకులు కొరకొప్పుల రాంబాబు, తదితరులు చైర్మన్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ జ్ఞాపిక, డైరీని అందజేసి శాలువ కప్పి సన్మానించారు. పఠనాసక్తిని పెంపొందించేలా జిల్లాలోని గ్రంథాలయాలను తీర్చిదిద్దాలని సూచించారు. పత్రికలన్నీ గ్రంథాలయాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రంథాలయాల్లో వసతులు మెరుగుపర్చాలని, డిజిటల్ లైబ్రరీలుగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు

**ఖమ్మం,మే 24(మనం బ్యూరో):** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, గత పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేనని, తెలంగాణ సమాజాన్ని వంతులవారీగా కొల్లగొడుతున్న దొంగల ముఠాలుగా మారాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నారపురాజు రామచందర్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం ఖమ్మం నగరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల పాటు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని నిలువునా దోచుకుంటే, ఈ రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఆ లోటును భర్తీ చేస్తూ ప్రజా ధనాన్ని ఇష్టారాజ్యంగా కొల్లగొడుతోందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద అవినీతి కుంభకోణం కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న సీబీఐ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. పూర్తి స్థాయిలో, అన్ని విభాగాలపై సమగ్ర విచారణకు ఆదేశించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, కేవలం కొన్ని చిన్నపాటి సాంకేతిక విషయాలను మాత్రమే సీబీఐకి అప్పగించి అసలు దోషులను, బీఆర్ఎస్ పెద్దలను రక్షించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఉన్న చీకటి ఒప్పందాలకు ఈ కాళేశ్వరం సీబీఐ విచారణ తూతూమంత్రంగా సాగడమే అతిపెద్ద నిదర్శనమని అన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వరి, మొక్కజొన్న పండించిన అన్నదాతల పరిస్థితి అత్యంత దయనీయంగా, కన్నీరు పెట్టించే విధంగా తయారైందన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సకాలంలో తెరవకపోవడం, తెరిచిన చోట కనీస వసతులు కల్పించకపోవడం వల్ల రైతులు రోడ్లపైనే, ఐకేపీ కేంద్రాల వద్ద రాత్రి పగలు అనక వారాల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని మండిపడ్డారు. తేమ శాతం పేరుతో, తాలు పేరుతో క్వింటాళ్లకు కిలోల కొద్దీ అక్రమ తరుగు తీస్తూ మిల్లు యజమానులు, ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు రైతులను నిలువునా దోచుకుంటున్నా అధికారులు, పాలకులు కంటి నిండా నిద్రపోతున్నారని విమర్శించారు. మొక్కజొన్న రైతులకు కనీస మద్దతు ధర దక్కడం లేదని, దళారుల చేతుల్లో అన్నదాతలు చిక్కి విలవిలలాడుతున్నా ప్రభుత్వం కనీస జోక్యం చేసుకోవడం లేదని దుయ్యబట్టారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేయడం వల్లే ఆయిల్ పామ్, వరి, పత్తి పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. తక్షణమే స్పందించి పూర్తి స్థాయిలో రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలని, కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి గింజనూ మద్దతు ధరతో సేకరించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రైతులను ఏకం చేసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

మౌలిక వసతుల కల్పన అంతా కేంద్ర నిధులతోనే జరుగుతుంటే, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆ నిధులను తమ సొంత ఖాతాలో వేసుకుంటూ, తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంపై నిందలు వేస్తోందని ఆయన దుయ్యబట్టారు. జాతీయ భద్రత, ఉగ్రవాద నిర్మూలన విషయంలో గత కాంగ్రెస్ ప్రభుత్వానికి, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని రామచంద్రరావు వివరించారు. రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే డబుల్ ఇంజిన్ సర్కార్తో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెడతాయని రామచంద్రరావు హామీ ఇచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఖమ్మం గడ్డపై కాషాయ జెండా ఎగరేస్తే, కేంద్రం నుంచి ప్రత్యేకంగా వేల కోట్ల రూపాయల నిధులను తీసుకువచ్చి, జిల్లా రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా ప్రబరి, ఇన్చార్జి మహిపాల్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్ రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ గల్లా సత్యనారాయణ, గోంగూర వెంకటేశ్వర్లు,సారగుల అమరనాథ్, వాకధాని పుల్లారావు, సన్నీ ఉదయ ప్రతాప్,నంబూరి రామలింగేశ్వరరావు, రుద్ర ప్రదీప్,మందడపు సుబ్బారావు, ఖమ్మం కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, సీనియర్ నాయకులు గంట్యాల విద్యాసాగర్, నున్న రవికుమార్, శీలం పాపారావు,జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు నల్లగట్టు ప్రవీణ్ కుమార్ పమ్మి అనిత, రజిని రెడ్డి , వీరవెల్లి రాజేష్, రవి గౌడ్, సురేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.







# మనం ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్- ఖమ్మం అర్బన్ - రఘునాథపాలెం

# సుడా, గ్రంథాలయాల ద్వారా మెరుగైన సేవలందించాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- కార్యకర్తల త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మర్చిపోదు
- సంక్షేమ పథకాలను గ్రామ, గ్రామానికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపు
- సుడా, జిల్లా గ్రంథాలయ చైర్మన్ లకు నిర్వహించిన అభినందన సభలో పాల్గొన్న డిప్యూటీ సీఎం, మంత్రి తుమ్మల





**ఖమ్మం, మే 24(మనం బ్యూరో):** కష్టకాలంలో సైతం అండగా నిలిచిన కార్యకర్తలను ప్రభుత్వం ఎప్పటికీ మర్చిపోదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో స్తంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబాలకు ఆదివారం నిర్వహించిన అభినందన సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ మట్ట రాగమయి, రాందాస్ నాయక్, కూనంనేని సాంబశివరావు లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ నాయకులకు పదవులు వచ్చినప్పుడు కార్యకర్తలు చూపుతున్న ఆనందం పార్టీపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. దేశ స్వాతంత్ర్య సమరానికి ముందే గ్రంథాలయ ఉద్యమాలు ప్రజల్లో చైతన్యం నింపాయని, ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట, జనగాం ప్రాంతాలు ఆ ఉద్యమాలకు కేంద్ర బిందువులుగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రజలపై అత్యంత ప్రభావం చూపే సంస్థ గ్రంథాలయమని, అలాంటి సంస్థకు చైర్మన్గా బాధ్యతలు స్వీకరిస్తున్న మహమ్మద్ ఖాదర్ బాబాకు అభినందనలు తెలిపారు. సుడా, జిల్లా గ్రంథాలయ సంస్థల ద్వారా ప్రజలకు మరింత మేలు జరిగేలా పని చేయాలని సూచించిన ఆయన, ప్రజలకు సేవలు అందించేందుకు అవసరమైన సహకారం స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు తప్పనిసరిగా అందిస్తారని అన్నారు. 2014 నుంచి 2023 వరకు రెండు పర్యాయాలు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ జెండాను భుజాన వేసుకుని కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వం ఎప్పటికీ నిర్లక్ష్యం చేయదని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన డిప్యూటీ సీఎం, ప్రస్తుతం మార్కెట్లో కిలో 55 రూపాయలు ఉన్న సన్న బియ్యాన్ని కోటి ఆరు లక్షల కుటుంబాలకు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. 53 లక్షల నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నా మని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ గ్రామానికి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు అందిస్తామని, కార్యకర్తలు వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన నాయకులకు నేడు సుడా చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులు రావడం సంతోషకరమని అన్నారు. నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తే రాష్ట్ర నాయకత్వం తప్పకుండా గుర్తింపు ఇస్తుందని చెప్పారు. పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ కు పదవి రావడం తనకు వ్యక్తిగతంగా ఆనందంగా ఉందని, ఖమ్మం నగరంతో పాటు పరిసర మండలాల అభివృద్ధికి సుడా ద్వారా మరిన్ని నిధులు తీసుకురావాలని సూచించారు. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఖమ్మం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి అప్పులు ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి లోటు లేకుండా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం, మంత్రి, ఖమ్మం ఎంపీ, సుడా చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ న్యాయవాదులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి

–ఎంఎల్ఏ కూనంనేనిని కలిసి విన్నవించిన న్యాయవాదులు



**ఖమ్మం, మే 24(మనం న్యూస్):** జూనియర్ న్యాయవాదులకు కూడా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ బాధ్యులు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) బాధ్యులు కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావుకు విన్నవించారు. ఆదివారం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్లో కమిటీ అధ్యక్షులు దిలీప్ చౌదరి తాళ్లూరి, ఐఏఎల్ జిల్లా కోశాధికారి కొలికొండ శరత్బాబు ఎంఎల్ఏ సాంబశివరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 36వేల మంది న్యాయవాదులు ఉన్నప్పటికీ తాజాగా న్యాయవాదుల సంక్షేమ ట్రస్టు విడుదల చేసిన నోటిఫికేషన్లో కేవలం 20వేల మంది న్యాయవాదులకు మాత్రమే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినట్లు ప్రకటించారని తెలిపారు. 2019 నుంచి ఇప్పటి వరకు బార్ కౌన్సిల్లో నమోదు చేసుకున్న న్యాయవాదుల్లో సుమారు 15వేల మంది 35 సంవత్సరాల లోపు యువ న్యాయవాదులేనన్నారు. కెరీర్ ప్రారంభ దశలో ఉన్న వీరు అనేక ఆర్థిక వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఇన్సూరెన్స్ సౌకర్యం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యువ న్యాయవాదులకు కూడా ఇన్సూరెన్స్ వర్తింపజేస్తే వారి కుటుంబాలకు రెండు లక్షల ఇన్సూరెన్స్తో పాటు ప్రమాదవశాత్తు మరణించిన సమయంలో రూ.10లక్షల ఆర్థిక సాయం అందుతుందన్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన రూ.100 కోట్లతో మరో రూ.100 కోట్లను న్యాయవాదుల సంక్షేమం కోసం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఆ నిధులు విడుదల కాలేదన్నారు.

**–ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం : కూనంనేని**

జూనియర్ న్యాయవాదుల ఇన్సూరెన్స్ సమస్యతో పాటు న్యాయవాదుల సంక్షేమం కోసం కేటాయించిన రూ.100 కోట్ల అంశంపై త్వరలో ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తానని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమ చట్టం సందర్భంగా ఈ అంశాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించానని, కార్పస్ ఫండ్ విషయాన్ని మరో సారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) నగర కార్యదర్శి ముమ్మడి సతీష్, కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




# మచ్చలేని మహోన్నత నేత గిరిప్రసాద్

– సంక్లిష్ట స్థితికి దారితీస్తున్న మోడీ పాలన : గిరిప్రసాద్ వర్ధంతి సభలో బాగం

**ఖమ్మం, మే 24(మనం న్యూస్):** తుదిశ్వాస వరకు ప్రజల పక్షాన నిలబడి చారిత్రక పోరాటాలకు నేతృత్వం వహించిన సిపిఐ అగ్రనేత గిరిప్రసాద్ మచ్చలేని మహోన్నత నాయకుడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి సామాజిక పరిస్థితులను అధ్యయనం చేసి సాయుధుడై ముందుకు సాగిన గిరిప్రసాద్ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ముందే అంచనా వేసిన కమ్యూనిస్టు తత్వవేత్త అని ఆయన తెలిపారు. నల్లమల గిరి ప్రసాద్ 40వ వర్ధంతి సందర్భంగా సిపిఐ కార్యాలయంలో ఎస్కె జానిమియా అధ్యక్షతన జరిగిన సభలో బాగం హేమంతరావు ప్రసంగించారు. వర్ధంతి సభకు ముందు పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిప్రసాద్ విగ్రహం వద్ద సిపిఐ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి ఆవిష్కరించారు. వర్ధంతి సభలో హేమంతరావు మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన గిరిప్రసాద్ మహోన్నత తెలంగాణ సాయుధ పోరాటంలో సాయుధ దళ నేతగా పని చేశారన్నారు. వేలాది ఎకరాల భూమిని పంపిణీ చేస్తూ వందల గ్రామాలను విముక్తి చేసిన చరిత్ర గిరిప్రసాద్ ది అన్నారు. ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో తుపాకీ గుండు మచ్చ తప్ప మరోక మచ్చ లేదని హేమంతరావు స్పష్టం చేశారు. శాసనసభ్యునిగా, రాజ్యసభ సభ్యునిగా, ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన గిరిప్రసాద్ భారతదేశ రాజకీయ చిత్ర పటంపై తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకు న్నారన్నారు. సామాజిక సమస్యల పట్ల అవగాహన, గొప్ప పోరాట కార్యాచరణ కలిగిన గిరిప్రసాద్ నేటి తరాలకు మార్గదర్శి అన్నారు. భారతదేశం సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటున్న నేటి పరిస్థితుల్లో గిరిప్రసాద్ ఆశయ సాధన కోసం పోరాడటమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని హేమంతరావు తెలిపారు. ఈ దేశం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని యువత మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై తిరుగుబాటుకు సమాయత్తం అవుతున్నారన్నారు. ఈ దేశాన్ని నిరుద్యోగం, అవినీతి పట్టి పీడిస్తున్నాయని అదే సమయంలో ఉపాధి, ఉద్యోగ కల్పన రంగాలు పూర్తిగా ఉనికిని కోల్పోతున్నాయన్నారు. ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ప్రకటనలు చేస్తున్న కార్యనిర్వహక వర్గం ప్రజల ముందు దోషిగా నిలబడే ప్రమాదం ఉందని ఒక న్యాయమూర్తి వ్యాఖ్యలు దేశంలో ఒక గొప్ప కదలికకు కారణమయ్యాయని ఈ సందర్భంగా హేమంతరావు గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అధ్యయనం చేస్తూ క్రియాశీలకంగా వ్యవహరించడమే దివంగత నేతలకు సరైన నివాళి అన్నారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ, జిల్లా నాయకులు గాదె లక్ష్మి నారాయణ, ఏసు, మోహన్‌రావు, కృష్ణమూర్తి, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# మనం పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

## వివోఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

### సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను



**తిరుమలాయపాలెం మే 24 (మనం న్యూస్):** ఎన్నో సంవత్సరాల తరబడి ప్రభుత్వ ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్న వివోఏలు అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నారని వారికి కనీస వేతనం అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివో ఏలు మే 18 నుండి సమ్మెలో భాగంగా చేపట్టిన దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వివోఏల పట్ల నిర్లక్ష్య ధోరణి విడనాడి వివోఏ ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారికి కనీస వేతనం 20 వేల రూపాయలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సుమారు 30 40 సంవత్సరాల నుంచి వివో ఏలు గ్రామాలలో స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా అభివృద్ధి చేస్తూ వస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో వారిని భాగస్వాములు చేస్తూ వస్తున్నారని గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై ఉండే వివోఏ లతో అధికార పార్టీ నాయకులు వారిని ఎలక్షన్ సమయంలో పోల్ స్లిప్పులు పంపిణీ మొదలుకొని ఎన్నికల కేంద్రాల వద్ద పనులు పురమాయిస్తూ అనంతరం వారిని పట్టించుకోవట్లేదని ఆయన అన్నారు వెంటనే ప్రభుత్వం స్పందించి వారి కనీస వేతనం అమలు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నేరుగా వారి వ్యక్తిగత ఖాతాల్లో వేతనాన్ని అమలు చేయాలని 57 ఏళ్లు దాటిన వివోఏ లకు పెన్షన్లు జీవిత బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో వివో ఏల జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల గుగ్గిళ్ళ ఉమా మందాది కళమ్మ బొడ్డు కుసుమ ఎం మాధురి మేకల కృష్ణవేణి సిహెచ్ జ్యోతి షేక్ జానీ బేగం ఉపేంద్ర సువర్ణ ఉష ఇందిరా విజయ కుమారి సుజాత మంజుల శ్రావణి ధనలక్ష్మి జయ గోపోజి ఉపేంద్ర పాల్గొన్నారు

## వెంపటి ప్రభాకర్‌కు దయాకర్ రెడ్డి నివాళి



**ఖమ్మం రూరల్, మే 24 (మనం న్యూస్):** ఇటీవల మరణించిన వెంపటి 32వ వార్డు కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ దశదిన కార్యక్రమం లో కార్యక్రమానికి మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అనిత హాజరై వెంపటి ప్రభాకర్ చిత్రపటానికి నివాళు లు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభాకర్ సేవలను గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు కౌన్సిలర్ వెంపటి ఉమా వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు వెంకట్ నారాయణ, రంజిత్ నాయక్, వెంపటి రవి, కొట్టం శిరీషా రంజిత్ రెడ్డి, ఎర్రా శేఖర్ రెడ్డి, అశోక్ రెడ్డి, ఏపూరి తరుణ్ తదితరులు పాల్గొన్నారు

## గట్టుసింగారంలో వడదెబ్బతో యువకుడు మృతి



**కూసుమంచి, మే 24 (మనం న్యూస్) :** ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం, గట్టుసింగారం గ్రామంలో దుంపల సాయి చరణ్(31) అనే వ్యక్తి వడదెబ్బతో మృతి చెందిన విషాద సంఘటన జరిగింది. వడదెబ్బతో గత రెండు రోజులుగా అస్వస్థతకు గురైన సాయిచరణ్ ఆదివారం తుది శ్వాస విడిచినాడు, వడదెబ్బతో కోలుకోకుండా మృతి చెందడంతో గట్టుసింగారం గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. దుంపల సాయిచరణ్ కు భార్య ఇద్దరు కుమారులు కలరు. రెండు రోజులుగా అస్వస్థకు గురైన సాయి చరణ్ మృతి చెందడంతో భార్య, ఇద్దరు చిన్న పిల్లలు, బంధువులు, స్నేహితులు, గ్రామ ప్రజలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం దుంపల సాయి చరణ్ కుటుంబాన్ని ఆదుకోవాలని గట్టు సింగారం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## నిరసన దీక్షా శిబిరంలో స్పృహ తప్పిన వివోఏ అరుణ...

### సి. హెచ్.సి ఆసుపత్రి లో చికిత్స

### మండుటెండలో సైతం

### కొనసాగుతున్న పోరాటం



**తిరుమలాయపాలెం, మే 24 (మనం న్యూస్):** తిరుమలాయపాలెం మండల కేంద్రంలో వివోఏల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఉద్రిక్త వాతావరణంలో కొనసాగుతున్నాయి. మండుటెండను సైతం లెక్కచేయకుండా మూడో రోజు కూడా వివోఏలు దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా బచ్చోడు గ్రామానికి చెందిన వివోఏ పోలిశెట్టి అరుణ దీక్షలో పాల్గొంటూ ఒక్కసారిగా స్పృహ తప్పి కుప్పకూలడంతో అక్కడ ఉన్న తోటి వివోఏలు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం వైద్యులు ఆమె ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఉదయం నుంచి ఆహారం, నీరు తీసుకోకుండా మండుటెండలో దీక్ష కొనసాగించడంతోనే అరుణ అస్వస్థతకు గురైనట్లు తోటి వివోఏలు తెలిపారు. అరుణ స్పృహ తప్పి పడిపోవడంతో దీక్షా శిబిరం వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు వివోఏలు భావోద్వేగానికి గురై ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వివోఏలు చాలా కాలంగా కనీస వేతనం అమలు, ఉద్యోగ భద్రత, పెండింగ్ బకాయిల చెల్లింపు, సంక్షేమ పథకాలు అమలు తదితర డిమాండ్లతో పోరాటం చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కనీస వేతనం కూడా లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. దీక్షా శిబిరాన్ని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు సందర్శించి వివోఏలకు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వివోఏల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వివోఏ అరుణకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని, దీక్ష చేస్తున్న వారందరి ఆరోగ్య పరిస్థితిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. మరోవైపు అరుణ ఆరోగ్య పరిస్థితిపై తోటి వివోఏలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, ప్రభుత్వం ఇప్పటికైనా చర్చలకు రావాలని కోరుతున్నారు. మండుటెండలోనూ కుటుంబాలను వదిలి నిరాహార దీక్షలు చేస్తున్న తమ పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వివో ఏ పోలిశెట్టి అరుణను మాజీ సర్పంచ్ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పరామర్శించి ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.





## కూసుమంచిలో యోగ శిక్షణ కార్యక్రమం

### ప్రజలందరూ హాజరు కావాలి

### యోగ వల్ల మానవాళికి అనేక ఉపయోగాలు

### శ్రీ సత్య సాయి ధ్యాన మండలి శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు

### మానసిక ప్రశాంతతకు యోగా మార్గం : ప్రముఖ వ్యాపారవేత్త చౌడవరపు రమేష్

**కూసుమంచి, మే 24 (మనం న్యూస్) :** కూసుమంచి మండల కేంద్రంలో ఉచిత యోగ కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ సత్యసాయి ధ్యాన మండలి సభ్యులు చౌడవరపు రమేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఈనెల 17 నుండి కాలవ్యవధి: 10 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్థలం: ఎస్.ఆర్. ఫంక్షన్ హాల్, కూసుమంచి నందు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శ్రీ సత్య సాయి ధ్యాన మండలి -- కూసుమంచి శాఖ ఆధ్వర్యంలో యోగ శిక్షణ కార్యక్రమాలు కూసుమంచి మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్వహించబడుతున్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ముఖ్యంగా శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని. ఆధ్యాత్మిక అవగాహన పెరుగుతుందని. దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించుకోవచ్చు అని. ఏకాగ్రత మరియు జ్ఞాపకశక్తి పెరుగుతుందని. అధిక బరువు సమస్య తగ్గుతుందని. వ్యక్తిత్వ మరియు జ్ఞానపరమైన అభివృద్ధి కలుగుతుందని తెలిపినారు. 14 సంవత్సరాల నుండి 80 సంవత్సరాల వయస్సు వరకు ఉన్న స్త్రీ, పురుషులు అందరూ పాల్గొనవచ్చు అన్నారు. ప్రత్యేక ఈ కార్యక్రమంతో పాటు నిత్య యోగ సాధన కూడా ప్రారంభం కాబోతోందని ఈ సందర్భంగా తెలిపినారు. ఆరోగ్యవంతమైన మరియు ఆనందమైన జీవితానికి యోగాన్ని అలవాటు చేసుకుందాం అని ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ సత్య సాయి ధ్యాన మండలి సభ్యులు చౌడవరపు రమేష్ ప్రజలకు పిలుపునిచ్చారు.

## సిపిఎం నేత పెరుమాళ్ళు మృతి

### పార్టీ రాష్ట్ర నాయకులు పోతినేని, జిల్లా కార్యదర్శి నున్నానాగేశ్వరరావు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ నివాళి



**నేలకొండపల్లి, మే 24 (మనం న్యూస్) :** నేలకొండపల్లి మండలంలోని రాజారాంపేట గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నేత పోతనబోయిన పెరుమాళ్ళు(65) ఆదివారం గుండెపోటుతో మరణించారు. ఆదివారం ఉదయం ఆయన తీవ్ర అస్వస్థకు గురి కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే పెరుమాళ్లను ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య ఉన్నారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోతనబోయిన పెరుమాళ్ళు పార్టీ పట్ల అత్యంత విశ్వాసం, అంకిత భావంతో పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. పార్టీ కార్యక్రమాలు ఏవి ఎక్కడ జరిగిన అలుపు సొలుపు లేకుండా హాజరై జెండా మీద ప్రగాఢ విశ్వాసాన్ని, అభిమానాన్ని, ఉద్యమ స్ఫూర్తిని చాటుకునేవారన్నారు. ఆయన తుది శ్వాస వరకు ఎర్రజెండా మీద ఎనలేని అభిమానంతో పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని అన్నారు. ఆయన భౌతిక కాయాన్ని సందర్శించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి, ఏటుకూరి రామారావు, నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, దుగ్గి వెంకటేశ్వర్లు, భూక్య కృష్ణ, మారుతి కొండలరావు, ఎడ్ల తిరుపతిరావు, మందడపు మురళీకృష్ణ, కట్టెకోల వెంకటేశ్వర్లు, బెల్లం లక్ష్మి తదితరులు నివాళులర్పించారు.

# తెలంగాణ గురుకుల పాఠశాల/ కళాశాల గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**వైరా, మే 24 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల/ కళాశాల వైరా (బాలికలు),బూర్గంపాడు (బాలికలు) ఎన్కూర్ (బాలురు) నందు 2026 -27 విద్యా సంవత్సరంలో ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు ఖాళీగా ఉన్న గెస్ట్ టీచర్ లు గా పని చేయుటకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలంగాణ గురుకుల పాఠశాల/ కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల రమ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైరా, బూర్గంపాడు (బాలికలు) పాఠశాలలకు మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. జూనియర్ కళాశాల ల్లో మాథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బోటనీ , జువాలాజి, సంస్కృత సబ్జెక్ట్ లు పి జి టి సంబంధిత పోస్టులలో పి జి,బి ఈ డి , టెట్ టి జి టి సంబంధిత పోస్టుల కు డిగ్రీ, బిఈడి టెట్ అర్హతలు గా నిర్ణయించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను తెలంగాణ గురుకుల పాఠశాల/ కళాశాల ఎన్కూర్ నందు అందజేయాలని తెలిపారు. దరఖాస్తులు 25 నుండి 27 సాయంత్రం వరకు మాత్రమే స్వీకరించబడునని తెలిపారు. ఉదయం 10.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించు సమయమని, ఇతర వివరాల కోసం గురుకుల పాఠశాల వైరా, ఎన్కూర్, బూర్గంపాడు ప్రిన్సిపాల్ ను సంప్రదించాలని వైరా ప్రిన్సిపాల్ బి రమ తెలిపారు.

# ఇటుక బట్టీల దందా....

**పల్లెగూడెం పోలేపల్లిలో ప్రజలకు పొగ, పంటలకు మంటల ముప్పా..?**

**భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతోందని స్థానికుల ఆందోళన**

**పొగ, దూళి దుమారంతో రోడ్లపై ప్రజలకు నరకయాతన**



**ఖమ్మం రూరల్, మే 24 (మనం న్యూస్)** ఖమ్మం రూరల్ మండలంలోని పల్లెగూడెం పోలేపల్లి రెవెన్యూ పరిధి ప్రస్తుతం ఇటుక బట్టీలకు కేరాఫ్‌గా మారిందనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఒకప్పుడు పచ్చని పంట పొలాలతో కళకళలాడిన ఈ ప్రాంతం, ఇప్పుడు ఇటుక బట్టీల దందాకు కేంద్రంగా మారింది ఆరోపణలు స్థానికుల్లో ఆందోళన రేకెత్తిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఈ కార్యకలాపాలు ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటుకల తయారీ కోసం భారీగా మట్టి తవ్వకాలు జరగడంతో భూగర్భ జలాల స్థాయి క్రమంగా దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే ఎండలు మండిపోతున్న పరిస్థితుల్లో ఇటుక బట్టీల నుంచి వెలువడే విపరీతమైన వేడి గాలులు ప్రాంతంలో ఉష్ణోగ్రతలను మరింత పెంచుతున్నాయని అంటున్నారు. ఒకవైపు ప్రకృతి ఎండలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు ఇటుక బట్టీల వేడి పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తోందని వాపోతున్నారు. అదేవిధంగా ఇటుక బట్టీల నుంచి వచ్చే పొగ, దూళి, దుమారం రోడ్లపై ప్రయాణించే ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఒకవైపు పొగ కమ్మేస్తుండగా, మరోవైపు ఎగిసిపడే దుమ్ము వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్వాస సంబంధిత సమస్యలు పెరిగే అవకాశం ఉందనే భయాందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఇటుక బట్టీల నుంచి ఎగిసే సన్నపాటి మంటలు, వేడి గాలులతో రగులుకుంటూ



సమీప పంట పొలాలపై పడుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో తరచూ పంట పొలాల్లో మంటలు చెలరేగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంటలు ఎక్కడి నుంచో రావడం కాదు... నియంత్రణ లేకుండా నడుస్తున్న ఇటుక బట్టీల నుంచే ప్రమాదాలకు నాంది పలుకుతోందా? అనే ప్రశ్న ఇప్పుడు స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది.

# చింతపల్లిలో బంగారు మైసమ్మ తల్లి వేడుకలు



**ఖమ్మం రూరల్, మే 24(మనం న్యూస్)** ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన బంగారు మైసమ్మ తల్లి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఖమ్మం రూరల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట వీరభద్రం మాజీ సర్పంచ్ ముత్యం చిన్న కృష్ణారావు చింతపల్లి గౌడ సంఘం అధ్యక్షులు మేకపోతుల చిన్నపరమయ్య బుర్ర రాజేశ్ హాజరయ్యారు. అమ్మవారిని కొలుచుకున్నారు. ఈ సందర్భంగా తోట వీరభద్రం మాట్లాడుతూ.. మన గ్రామానికి సంబంధించిన అమ్మవారి గుడి ప్రజలందరి ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలని అన్నారు. ఇటువంటి ఆలయాలు కుల, మత భేదాలు లేకుండా అందరికీ సమానమని, గ్రామ ప్రజలంతా కలిసి ఐక్యంగా వాటి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామ సంప్రదాయాలు, ఆచారాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ కన్వీనర్ ఆరెంపుల ఉపేందర్ ఆరెంపుల రామ్మూర్తి, రామయ్య వీరభద్రం, బాబు, సతీష్,మాధవరావు, చిర్ర నరేందర్, ఆరెంపుల వెంకన్న, కొట్టే గోపి, శ్రీకాంత్, కొమ్ము రాజేష్, వెంకటేష్, భరత్, ప్రవీణ్, తేజ్, వనపర్ల చిన్న ఏసు, టీం పొంగులేటి సోషల్ మీడియా వారియర్ ఆరెంపుల బద్రిసాయి తదితరులు పాల్గొన్నారు...

మనం



# వైరా

వైరా - కారేపల్లి - కొణిజర్ల - ఏన్కూరు - జూలూరుపాడు

## ఏదులాపురం 9వ వార్డులో అభివృద్ధి పనులకు కసరత్తు



**ఖమ్మం రూరల్, మే 24 (మనం న్యూస్)** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృషితో, మంజూరైన రూ.75 కోట్ల అభివృద్ధి పనులలో పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్ రెడ్డి దృష్టితో భాగంగా 9వ వార్డు పరిధిలో మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్ బాబు చొరవతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కసరత్తు ప్రారంభమైంది. ఈ క్రమంలో ఏవిఆర్ వెంచర్, ఎస్సీ బీసీ కాలనీ, చిన్న వెంకటగిరి, జంగాల కాలనీలలో నూతనంగా మంజూరు చేయనున్న సీసీ డ్రైన్లు, సీసీ రోడ్ల పనుల కోసం 9వ వార్డు కౌన్సిలర్ కందుకూరి శేషమ్మ వెంకటనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ ఏఈ బాబు సంబంధిత ప్రాంతాలను పరిశీలించి కొలతలు చేపట్టారు. ఈ అభివృద్ధి పనులతో ఆయా కాలనీల్లో మౌలిక వసతులు మెరుగుపడి ప్రజలకు రవాణా, పారిశుద్ధ్య సమస్యలు తగ్గనున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## వడదెబ్బతో మహిళ మృతి



**కారేపల్లి, మే 24 (మనం న్యూస్) :** వడదెబ్బ తగిలి మహిళ మృతి చెందిన ఘటన సింగరేణి మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది.సింగరేణి మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో ఆదివారం ఉదయం చేను పనులకు వెళ్ళిన వెంకటమ్మ(60) వడదెబ్బతో మృతి చెందినట్లు ఆమె భర్త రాఘవులు, కుటుంబ సభ్యులు తెలిపారు. పనులు పూర్తిచేసుకుని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలోనే వెంకటమ్మ స్పృహ కోల్పోయి పడిపోవడంతో ఇరుగుపొరుగు వారు ఆమెను గమనించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం ఆమె ప్రాణాలు విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## చలివేంద్రాలు ప్రారంభం



**సత్తుపల్లి, మే 24, (మనం న్యూస్) :** సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మరియు వెంగళరావు నగర్ లో సింగరేణి సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా దయానంద్ , సత్తుపల్లి ఏరియా జిఎం చింతల శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్, జేవిఆర్ ఓసి ఎన్విఆర్ ప్రహ్లాద్ ప్రారంభించారు. ఈ చలివేంద్రాలు వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి సింగరేణి సౌజన్యంతో ఏర్పాటు చేయడం మైనది. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ కమల్ పాషా, పింగిలి సామేలు, ఆర్టీసీ అధికారులు, వెల్ఫేర్ ఆఫీసర్ కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## భగవద్గీత పోటీల్లో రాజ్యలక్ష్మికి ఫస్ట్ ప్రైజ్




**వైరా, మే 24 (మనం న్యూస్):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శృంగేరిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన భగవద్గీత పోటీలలో వైరాకు చెందిన మిట్టపల్లి రాజ్యలక్ష్మి (భర్త కిరణ్ కుమార్) అద్భుత ప్రతిభ కనబరిచారు. ఎంతోమంది పాల్గొన్న ఈ పోటీల్లో ఆమె తన స్పష్టమైన ఉచ్చారణతో 'ప్రథమ శ్రేణి' సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజ్యలక్ష్మి సాధించిన ఈ విజయం పట్ల స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మనం

జనం కోసం అక్షర యజ్ఞం.



# మధిర

మధిర - ఎర్రుపాలెం - బోనకల్- చింతకాని - ముదిగొండ

## పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు కాంగ్రెస్ నేతల సన్మానం

**మధిర, మే 24 (మనం న్యూస్) :** ఖమ్మంలోని ఎన్.ఆర్. గార్డెన్స్‌లో నిర్వహించిన సుడా చైర్మన్ పువ్వాల దుర్గాప్రసాద్ అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మలోత్ రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ పులిబండ్ల చిట్టిబాబు తదితర నాయకులు పాల్గొని పువ్వాల దుర్గాప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం మరియు పట్టణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. సుడా చైర్మన్‌గా పువ్వాల దుర్గాప్రసాద్ సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో సముచిత గౌరవం దక్కుతోందన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పువ్వాల దుర్గాప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



## అగ్నికి ఆహుతైన జామాయిల్ తోటలు

### ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమంటున్న రైతులు

**ఎర్రుపాలెం, మే 24 (మనం న్యూస్) :** మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని తాటిగూడెం రెవెన్యూలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో జామాయిల్ తోటలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ట్రాన్స్ఫార్మర్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి వేగంగా వ్యాపించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం,పొలాల్లో హై ఓల్టేజ్ లైన్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి మొత్తం పది మంది రైతులకు చెందిన సుమారు ముప్పై ఎకరాల జామాయిల్ తోటలు మంటల్లో కాలిపోయాయి.ఈ ఘటనలో జామాయిల్ తోటలకు సుమారు నలభై లక్షలు రూపాయలు వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అగ్నిప్రమాదం కారణంగా పూర్తిగా ఆర్థికంగా దెబ్బతిన్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.సంబంధిత అధికారులకు సమాచారం అందించటం జరిగిందని వారు వెంటనే ఘటనాస్థలాన్ని పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి తగిన నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



## పిండిప్రోలు ఘనంగా గంపల గంగమ్మ జాతర...

**తిరుమలాయపాలెం మే 24 (మనం న్యూస్)** పిండిప్రోలు యాదవ కురుమల సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం గంపల గంగమ్మ జాతర నిర్వహించబడుతుందని సుమారు ఐదు సంవత్సరాల క్రితం యాదవ సంఘ సభ్యుల సహకారంతో గంగమ్మ మల్లన్న స్వామి దేవాలయాన్ని నిర్మించామని యాదవ సొసైటీ అధ్యక్షులు దొడ్డ గురవయ్య అన్నారు. ఆదివారం గ్రామంలోని యాదవ సంఘం కుటుంబ సభ్యులంతా భక్తిశ్రద్ధలతో మంగళ వాయిద్యాలతో డీజే మహిళల కోలాటంతో గంపలు ఎత్తుకొని గ్రామంలో ప్రదర్శనగా భారీ సంఖ్యలో గంగమ్మ మల్లన్న స్వామి దగ్గరికి వెళ్లారు. అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళలు గంగమ్మ కు పూజలు నిర్వహించిన అనంతరం రాత్రి గంగమ్మ దేవాలయం వద్ద యాదవ సంఘం కుటుంబ సభ్యులు అక్కడే జాగారం చేస్తారని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో సాంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం గా జరిగే జాతర్లలో ఎంత ప్రత్యేకత సంతరించుకుంటుందో తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామం లో గంగమ్మ మల్లన్న స్వామి పోతురాజు స్వాముల జాతర సంతరించుకుంటుందని అన్నారు. ఆదివారం పిండిప్రోలు లో గంగమ్మ జాతర తో గ్రామంలో ఆధ్యాత్మిక శోభతో పాటు పండగ వాతావరణం నెలకొన్నది.



## ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సుడిగాలి పర్యటన

### అభివృద్ధి పనుల సమీక్ష

**మధిర, మే 24 (మనం న్యూస్) :** నియోజకవర్గ కేంద్రమైన మధిర మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డ్ గోదాముల పరిశీలన ఈ పర్యటనలో భాగంగా తొలుత మధిర మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన ఉపముఖ్యమంత్రి, గోదాములను పరిశీలించారు. నిల్వ సామర్థ్యం, నిర్మాణ ప్రమాణాల గురించి అధికారులతో చర్చించారు. వైరా నది రిటైనింగ్ వాల్ పనులు పరిశీలన మధిర -వైరా నదిపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరిశీలన చేశారు. నది పరివాహక ప్రాంత ప్రజలకు రక్షణగా చేపట్టిన ఈ ప్రాజెక్టును ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని భట్టి విక్రమార్క అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకే నిర్మాణ సామాగ్రిని వాడాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. జూలై నెల ముగిసేలోపు రిటైనింగ్ వాల్‌కు సంబంధించిన పునాది పనులు పూర్తి కావాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పట్టణంలోని 11వ వార్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ పనుల వల్ల స్థానిక ప్రజలకు, రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పనులు త్వరగా పూర్తి చేసి రోడ్లను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. మోడల్ 'మహాప్రస్థానం' సందర్శన అనంతరం మధిరలో అత్యున్నత సౌకర్యాలతో నిర్మిస్తున్న మోడల్ మహాప్రస్థానం (వైకుంఠధామం) పనులను భట్టి విక్రమార్క పరిశీలించారు. మధిర పట్టణాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ , ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



## 1992-93 యూజీడీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ఎర్రుపాలెం, మే 24 (మనం న్యూస్):** ముచ్చటగా 34 సంవత్సరాల. స్నేహబంధం, జీవిత ప్రయాణంలో ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలు, కాల ప్రవాహం ఎంత దూరం తీసుకెళ్లినా విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహబంధాలు మాత్రం ఎప్పటికీ చెదరవని మరోసారి నిరూపితమైంది. దాదాపు 34 ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకున్న పాత మిత్రులు ఆనందోత్సాహాలతో నాటి జ్ఞాపకాలను పునర్జీవింపజేశారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామంలోని నాలెడ్జ్ సెంటర్ ఈ అరుదైన ఆత్మీయ కలయికకు వేదికైంది.హైదరాబాద్ దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో 1992-93 విద్యా సంవత్సరంలో యూజీడీ పూర్తి చేసిన విద్యార్థులు ప్రథమ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.మీనవోలు గ్రామంలోని నాలెడ్జ్ సెంటర్‌లో ఆదివారం పీఈటీ రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశం ఉదయం నుంచే సందడిగా మారింది మూడు దశాబ్దాలకు పైగా విరామం తర్వాత కలుసుకోవడంతో స్నేహితుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నలుమూలల నుంచి పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా హాజరయ్యారు గుంటూరు ఒంగోలు శ్రీకాకుళం,విజయవాడ, హైదరాబాద్,భద్రాద్రి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత రోజుల్ని గుర్తుచేసుకున్నారు. కళాశాల రోజుల్లో చేసిన సరదా సంఘటనలు,గురువుల బోధనలు మైదానంలో గడిపిన క్షణాలు చర్చల్లో మార్మోగాయి వ్యాయామ విద్యను అభ్యసించిన వీరిలో పలువురు ప్రస్తుతం పీఈటీలుగా సేవలందిస్తుండగా మరికొందరు వివిధ వృత్తులు వ్యాపారాల్లో స్థిరపడ్డారు. వేర్వేరు రంగాల్లో ఉన్నప్పటికీ స్నేహాన్ని నిలబెట్టుకోవాలనే ఆత్మీయతతో ఇన్ని ప్రాంతాల నుంచి ఒకేచోట చేరడం కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఈ సందర్భంగా నిర్వాహకులు పూర్వ విద్యార్థులను సన్మానించారు.అనంతరం జ్ఞాపికలు అందజేసుకుని,గ్రూప్ ఫొటోలు దిగుతూ ఆనందంగా గడిపారు.నాటి స్నేహబంధం మళ్లీ మురిసిపోవడంతో కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో ముగిసింది. ఈ కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి జగన్మోహన్ గౌడ్ వినోద్ షర్మిల ప్రేమ్‌కుమార్ చంద్రయ్య గౌడ్ సంధాని భాషా నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



## చిరస్మరణీయుడు నల్లమల గిరి ప్రసాద్

### సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి బాబు

**మధిర, మే 24 (మనం న్యూస్) :** కార్మిక, కర్షక, పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నల్లమల గిరిప్రసాద్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా మిగిలిపోయాడని, భూపోరాటాలకు నాయకత్వం వహించి లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనత గిరిప్రసాద్ కు దక్కుతుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి బాబు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు సిపిఐ మాజీ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు నల్లమల గిరిప్రసాద్ వర్ధంతిని ఆదివారం తొండలగోపవరంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.తొలుత గిరిప్రసాద్ స్మారక స్థూపాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం జరిగిన సభలో రవిబాబు మాట్లాడుతూ, అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ధృవతారగా వెలుగొందిన గిరిప్రసాద్ జీవితం,ఆయన జిల్లాకు చేసిన త్యాగం నేటి తరం కార్యకర్తలకు,నాయకులకు స్ఫూర్తిదాయకమని అన్నారు.కమ్యూనిస్టు ఉద్యమాలను నడిపించడంలో కీలకపాత్ర పోషించిన గిరిప్రసాద్ లేని లోటును పరిపూర్తి చేయాల్సిన భాధ్యత అందరిపై ఉందన్నారు. నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేఖంగా ఆంధ్ర మహాసభ సాగించిన ఉద్యమం గురించి అద్యయనం చేశారన్నారు. ఉన్నత విద్యను, ఆస్తులను సైతం వదిలివేసి ఉద్యమబాట పట్టిన నల్లమల సాయుధ పోరాటాన్ని బలోపేతం చేశాడన్నారు. ఆయా ప్రాంతాల్లో దళాలు జరిపిన దాడుల్లో గిరి ప్రసాద్ నాయకత్వం వహించిన గొప్ప ఆదర్శ నాయకుడు అని, సీపీఐ పార్టీ రాష్ట్ర ,జాతీయ ఉప కార్యదర్శి గా, యంయల్ఎ, యంపీగా ప్రజలకు సేవలను అందించారు అని ఆయన కొనియాడినారు. అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన గిరిప్రసాద్ జిల్లా అభివృద్ధికి, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశాడన్నారు. ఆయన చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ నమ్మిన సిద్ధాంతాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించిన వాళ్లమవుతామని అన్నారు. ఈ కార్యక్రంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎమ్ ఏ రహీం,బోనకల్ సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, కొండూరి నాగేశ్వరావు,తొండలగోపారం గ్రామపెద్దలు వాసిరెడ్డి సత్యం,తదితరులు పాల్గొన్నారు.



మనం

సత్తుపల్లి

సత్తుపల్లి - వేంసూరు - పెనుబల్లి - కల్లూరు - తల్లాడ



# రిక్షా సైకిల్‌లో ఇరుక్కున్న చీర చెంగు: మహిళకు తీవ్ర గాయాలు

**హుటాహుటిన స్పందించి ప్రాణాలు నిలిపిన సత్తుపల్లి 108 సిబ్బంది**

**ఈఎంటి కృష్ణ, పైలట్ మహేష్‌లను అభినందించిన జిల్లా మేనేజర్లు**



**సత్తుపల్లిటౌన్, మే 24 (మనం న్యూస్):** ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండల పరిధిలో ఆదివారం ఒక దురదృష్టకర ప్రమాదం చోటుచేసుకుంది. సత్తుపల్లి వెంగళరావు కాలనీకి చెందిన పూజారి దువ్వెల రామకృష్ణ భార్య దువ్వెల రమణ సత్తెమ్మ గుడిలో పూజలు ముగించుకుని రిక్షా సైకిల్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో సత్తుపల్లి శివారులోకి రాగానే ఆమె చీర చెంగు ప్రమాదవశాత్తు రిక్షా సైకిల్ చక్రంలో ఇరుక్కుపోయింది. దీంతో ఆమె ఒక్కసారిగా కింద పడిపోవడంతో తల, మెడ భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. సమయస్ఫూర్తి చాటిన 108 సిబ్బంది: ప్రమాదం గురించిన సమాచారం అందిన వెంటనే సత్తుపల్లి 108 సిబ్బంది అత్యంత వేగంగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అత్యవసర పరిస్థితిని గమనించిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎమ్‌టీ ) గొల్లమండల కృష్ణ పైలట్ మహేష్ లు క్షతగాత్రురాలికి అక్కడికక్కడే ప్రథమ చికిత్స ప్రారంభించారు. తీవ్ర రక్తస్రావం కాకుండా గాయాలకు కట్లు కట్టి, మెడకు మరింత గాయం కాకుండా 'సి-కాలర్' అమర్చారు. బాధితురాలికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగకుండా ఆక్సిజన్ అందిస్తూ, సెలైన్ బాటిల్స్ ఎక్కించి మెరుగైన వైద్యం అందిస్తూ సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 108 సిబ్బంది సకాలంలో స్పందించి ప్రాథమిక చికిత్స అందించడం వల్లే ఆమె ప్రాణాలు సురక్షితంగా ఉన్నాయని వైద్యులు తెలిపారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి మహిళ ప్రాణాలు కాపాడిన సత్తుపల్లి 108 ఈఎంటి కృష్ణ, పైలట్ మహేష్‌లను ఖమ్మం జిల్లా 108 మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్, మూడు జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్ స్థానిక ప్రయాణికులు, ప్రజలు ముక్తకంఠంతో అభినందించారు.

# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిలువు దోపిడీ

**రెండు నెలలుగా మార్కెట్ యార్డుల్లోనే రైతుల పడిగాపులు**

**మిల్లర్ల ఇష్టారాజ్యం, లారీల కొరతపై జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలి**

**సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ డిమాండ్**



**సత్తుపల్లి టౌన్ మే 24 (మనం న్యూస్) :** రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం రైతులను నిలువు దోపిడీ చేస్తుంటే, పాలకులు చోద్యం చూస్తున్నారని సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ఆదివారం సత్తుపల్లిలోని రావి వీర వెంకయ్య భవనంలో అయినంపూడి సనందరావు అధ్యక్షతన సిపిఎం సత్తుపల్లి మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య వక్తగా పాల్గొన్న లిజాజిరి శ్రీనివాస్‌లి మాట్లాడుతూ.. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదని, మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం చెప్పే మాటలకు, క్షేత్రస్థాయిలో జరిగే పనులకు అస్సలు పొంతన లేదని ఎద్దేవా చేశారు. రెండు నెలల నిరీక్షణ:లి ఐకేపీ కేంద్రాలు, మార్కెట్ యార్డుల నుండి ధాన్యం సకాలంలో ఎగుమతి కాకపోవడంతో రైతులు గత రెండు నెలలుగా అక్కడే పడిగాపులు కాస్తున్నారు. మిల్లర్ల మాయాజాలం:లి రైస్ మిల్లర్ల యాజమాన్యం ఒక్క లారీ దిగుమతి కోసం ఆరు రోజుల సమయం తీసుకుంటూ కృత్రిమ లారీల కొరతను సృష్టిస్తోందని, దీనివల్ల కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని ఆరోపించారు. వాతావరణ ఆందోళనలు:లి ఒకపక్క కొనుగోళ్లు సాగక, మరోపక్క వాతావరణ మార్పులతో ఎప్పుడు వర్షం పడుతుందో తెలియక రైతాంగం బెంబేలెత్తుతుంటే.. అధికారులు మాత్రం రాజకీయ నాయకుల్లా ప్రకటనలు ఇస్తూ కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. తరుగు తీయకూడదు: జిల్లా యంత్రాంగం తక్షణమే జోక్యం చేసుకుని లారీల కొరతను తీర్చాలని, రైస్ మిల్లర్లు తరుగు పేరుతో రైతులను దోచుకోకుండా చూడాలని, కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఇదే వేదికగా కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా పెంచిన పెట్రోల్, డీజిల్, మరియు వంట గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, మండల కమిటీ సభ్యులు వేపులపాటి కుమారస్వామి, కువ్వారపు లక్ష్మణరావు, యలగం కృష్ణయ్య, తడికమళ్ళ రామకృష్ణ, హసావత్ కృష్ణ, యలగం రాములు, దాట్ల రాంబాబు, బెజవాడ లక్ష్మీనారాయణ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఎవరిని ఎంపిక చేసిన ఆమోదయోగ్యమే..

## సర్పంచి దీవెల వెంకటేశ్వరావు..



**తల్లాడ, మే 24 (మనం న్యూస్):** తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని, తల్లాడ సొసైటీ చైర్మన్ పదవులను తల్లాడ మండలంలో ఎవరికి ఇచ్చినా ఆమోద్య యోగ్యమేనని కొత్త వెంకటగిరి, బిల్లుపాడు, రామచంద్రపురం గ్రామాల సర్పంచులు దీవెల వెంకటేశ్వరావు, ఎనిక కృష్ణవేణి, తోట రామారావు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఎవరికి ఇచ్చిన తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. తల్లాడ మండల అభివృద్ధి కోసం పార్టీ నాయకులందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పాత కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్ అనే భేదాభిప్రాయాలు లేకుండా అందరూ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సమక్షంలో పనిచేయాలని సూచించారు. నామినేటెడ్ పదవులను ఎవరికి ఇచ్చినా మండల వ్యాప్తంగా అందరూ సుముఖంగా ఒకే మాటపై ఉండాలని అన్నారు. మూడు గ్రామాలను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు వారు వెల్లడించారు.

# పంట వ్యర్థాల దహనం ప్రమాదకరం



**ఖమ్మం రూరల్, మే 24 (మనం న్యూస్)** పంట వ్యర్థాల దహనం ప్రమాదకరం భూసారం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల భూమిలో సహజసిద్ధంగా ఉండే మిత్రపురుగులు, సూక్ష్మజీవులు నశించి భూసారం తీవ్రంగా దెబ్బతింటుందని ఖమ్మం రూరల్ మండల వ్యవసాయ అధికారి ఉమా నాగేశ్వరరావు తెలిపారు. పంటలకు అవసరమైన పోషకాలను అందించే సూక్ష్మజీవులు నశించడం వల్ల భవిష్యత్తులో దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా పంట వ్యర్థాల దహనం వల్ల వెలువడే పొగ వాయు కాలుష్యానికి కారణమవుతూ, ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారిపై దీని ప్రభావం అధికంగా ఉంటుందని వ్యర్థాలను తగులబెట్టే బదులు వాటిని భూమిలోనే కుళ్ళింపజేసి సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలని ఇందుకోసం రోటావేటర్ ద్వారా పంట అవశేషాలను భూమిలో కలియదున్నడం లేదా వేస్ట్ డికంపోజర్ ఉపయోగించి వాటిని త్వరగా కుళ్లిపోయేలా చేసి భూమి సారాన్ని పెంచుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పర్యావరణ పరిరక్షణతో పాటు భూమి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పంట వ్యర్థాల దహనానికి దూరంగా ఉండాలని కోరారు.

# పాలిసెట్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ 'అర్ఫుజ్ అలీ'ని అభినందించిన ఎమ్మెల్యే

**తెలంగాణ పాలిసెట్‌లో 120కి 120 మార్కులు సాధించిన విశ్వశాంతి విద్యార్థి**

**సత్తుపల్లికి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ రావడం ఇదే తొలిసారి: ఎమ్మెల్యే హర్షం**

**సత్తుపల్లి టౌన్, మే 24 (మనం న్యూస్) :** శనివారం విడుదలైన తెలంగాణ పాలిసెట్ (పాలీసెట్) ఫలితాలలో 120 మార్కులకు గాను 120 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ కైవసం చేసుకున్న సత్తుపల్లి 'విశ్వశాంతి విద్యాలయం' విద్యార్థి ఎండి. అర్ఫుజ్ అలీని ఆదివారం ప్రముఖులు ఘనంగా అభినందించారు. సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయానంద్, సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎండి. రెహానా బేగం కమల్ పాషా విద్యార్థిని కలిసి శాలువాతో సత్కరించి, మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా లిఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లి మాట్లాడుతూ, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఫలితాలలో సత్తుపల్లి నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు రావడం ఇదే మొదటిసారి కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థి అర్ఫుజ్ అలీ సత్తుపల్లి కీర్తిని రాష్ట్రస్థాయిలో చాటడమే కాకుండా, భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. విద్యార్థి తండ్రి అఫ్జల్ మాట్లాడుతూ.. తన కుమారుడు ఉపాధ్యాయుల సహకారంతో ఇటీవల విడుదలైన ౹ూజ ఫలితాల్లో 573 మార్కులు సాధించాడని, ఇప్పుడు పాలిసెట్‌లో గణితం (30/30), ఫిజిక్స్ (30/30), కెమిస్ట్రీ (30/30) సబ్జెక్టులలో వంద శాతం మార్కులతో 120/120 సాధించడం గర్వంగా ఉందన్నారు. పాఠశాల యాజమాన్యం స్పందన: విశ్వశాంతి పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, డైరెక్టర్ నరుకుళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. తమ విద్యాలయంలో కేవలం మార్కులే ధ్యేయంగా కాకుండా, సబ్జెక్టులపై విద్యార్థులకు లోతైన అవగాహన కల్పిస్తామని, ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ వల్లే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి సొసైటీ ( పిఏసిఎస్) అధ్యక్షులు చెల్లగల కృష్ణయ్య, టౌన్ పార్టీ అధ్యక్షులు చెన్నారావు,



పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, పాఠశాల ఉపాధ్యాయ బృందం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.



# పాల్వంచ

పాల్వంచ సిటీ - పాల్వంచ మండలం

## ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**- కాంగ్రెస్ కార్పొరేటర్ల సమావేశంలో కొత్వాల**



**పాల్వంచ, మే 24(మనం న్యూస్):** కొత్తగూడెం కార్పొరేషన్ లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి విజయం సాధించిన కార్పొరేటర్లు నిత్యం ప్రజల మధ్య వుంటూ ప్రజాసమస్యల పరిష్కారానికై కృషి చేయాలనీ రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పాల్వంచ పట్టణ పరిధి అయ్యప్పనగర్ లోని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నుండి ఎన్నికైన కార్పొరేటర్లు, పోటీ చేసిన డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ లో కార్పొరేటర్లు ఏ విధంగా ప్రజాసమస్యలపై స్పందించాలనే విషయమై చర్చించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. తమపై ఎంతో నమ్మకంతో, ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారనే ఆశతో కార్పొరేటర్లుగా గెలిపించారనీ, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి చేయాలన్నారు. ప్రజలకు సేవచేసే భాగ్యం అందరికీ రాదనీ కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కార్పొరేటర్లు కాల్వ భాస్కరరావు, కొత్వాల విమలాదేవి, సీరపు సుగుణ, చరపా శాంత, పైడిపల్లి జయలక్ష్మి, దున్నపోతుల మణి, దొంతేబోయిన నరేష్, ధర్మసోత్ నరేష్, భట్టు మురళి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, బద్ది కిషోర్, మాజీ పెద్దమ్మతల్లి గుడి చైర్మన్ మహీపతి రామలింగం, సొసైటీ డైరెక్టర్లు కనగాల నారాయణరావు, కాంగ్రెస్ నాయకులు ఎస్ వీ ఆర్ కే ఆచార్యులు, మిరియాల కమలాకర్, చింతా నాగరాజు, డిష్ నాగేశ్వరరావు, వాసుమల్ల సుందర్ రావు, మాలోత్ కోటి నాయక్, వాళ్లపల్లి రాంబాబు, నరిగె సుజాత, చల్లగుండ్ల సుజాత, భూక్యా చంటి, రాము, పెండ్యాల శ్రీనివాసరావు, బూసి శ్రీను, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నందన వనం పార్క్‌ను సద్వినియోగం చేసుకోండి

**- నిధులు కేటాయిస్తే మరింత అభివృద్ధి**
**- వాకింగ్ ట్రాక్ ను సుందరంగా తీర్చిదిద్దాలి**
**- మూడ్ గణేష్, కొత్వాల శ్రీనివాసరావు**





**పాల్వంచ, మే 24(మనం న్యూస్):** మండల పరిధి సోములగూడెం నందన వనం పార్క్ ను మరింత అభివృద్ధి చేసి, కొత్తగూడెం సెంట్రల్ పార్క్ లా తీర్చిదిద్దాలని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. అటవీశాఖ, జర్నలిస్ట్ ముత్తినేని శ్రీను సంయుక్త సారథ్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఫీల్ గుడ్ రిక్రియేషన్ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, వాకర్స్ పాల్గొన్నారు. పార్క్ లోని వాకింగ్ ట్రాక్ మీద ఉదయం వాకింగ్ చేశారు. ప్రక్రృతి అందాలు, స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిస్తూ పరవశించిపోయారు. మొత్తం 250 హెక్టార్ల విస్తీర్ణంలో వున్న పార్క్ కు ప్రచారం, ఆదరణ కరువైంది. దీంతో ప్రజలు పార్క్ ను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖులు, స్థానికులు ప్రకృతి వడిలో సేదదీరారు. వాకింగ్, శారీరక వ్యాయామంతో ఆరోగ్యాన్ని కాపాడుకొనేలా ఈ పార్క్ ను ఉపయోగించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. నందనవనానికి ఎక్కువ నిధులు కేటాయిస్తే మరితం అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెల్లి కొత్తగూడెం సెంట్రల్ పార్క్ లా అభివృద్ధి చేయుటకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్యాన్ని కాపాడుకొనుటకు ఇలాంటి పార్క్ లు ఎంతో దోహదపడతాయి. ముత్తినేని శ్రీను రాగి, జొన్న జావలను అల్పాహారంగా అందించారు. ఈ కార్యక్రమంలో యఫ్డీఓ దామోదర్ రెడ్డి, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వం, సింధు తపశ్వి, రాంబాబు, సోములగూడెం సర్పంచ్, వీసంశెట్టి పూర్ణ చందర్ రావు, నూకల రంగారావు, నరసింహ కుమార్, వాకర్స్ క్లబ్ సభ్యులు, గౌతమి క్రృష్ణ, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షులు, యోగ గురువు గంధం పట్టాభి రామారావు, వారి శిష్య బ్రృందం ఇక్కడి ఏర్పాట్ల ను చూసి అటవీ సిబ్బందిని అభినందించారు.

## మాజీ మంత్రి వనమా స్వగృహంలో బూత్ కమిటీల కోలాహలం..

**- తరలిన సమన్వయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు**



**పాల్వంచ, మే 24(మనం న్యూస్):** జిల్లా ఇంచార్జ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ఆదేశాల మేరకు బారాస సభ్యత్వ నమోదు ఊపందుకుంది. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సూచనలతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ వనమా వెంకటేశ్వరరావు స్వగృహంలో ఆదివారం నిర్వహించిన సమావేశం ఉత్సాహభరితంగా సాగింది. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, డిజిటల్ శిక్షణ కార్యక్రమాల నేపథ్యంలో జరిగిన ఈ సమావేశానికి కొత్తగూడెం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ డివిజన్ల పరిది పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాలకు చెందిన సమన్వయ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు వేగవంతం, డిజిటల్ యాప్ వినియోగం, పార్టీ బలోపేతంపై నాయకత్వం దిశానిర్దేశం చేసింది. ప్రతి కార్యకర్త పార్టీ కోసం సమిష్టిగా పని చేసి, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వనమా స్వగృహం పార్టీ నినాదాలతో మార్మోగిపోగా.. కార్యకర్తల ఉత్సాహం సమావేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## పెద్దమ్మ తల్లి గుడిలో విశేష పూజలు



**పాల్వంచ, మే 24 (మనం న్యూస్):** కేపీ జగన్నాధపురం శ్రీ కనకదుర్గ ( పెద్దమ్మతల్లి) దేవాలయాన్ని పెద్ద మొత్తంలో భక్తులు సందర్శించారు. ఆదివారం సెలవు దినం కావడంతో పరిసర ప్రాంత ప్రజలతోపాటు ఉమ్మడి ఖమ్మం సరిహద్దు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పిల్లాపాపలతో ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చాలని విశిష్ట పూజలు చేశారు. దేవాలయ ఆవరణలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కుమారి, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.




## కన్న తల్లిపైనే కొడుకు కిరాతకం

**- జగన్నాధపురంలో మానవత్వాన్ని మంటగలిపిన ఘటన**
**- తల్లిని దేవతగా చూసే సంస్కృతికి మచ్చ**
**- మద్యం మత్తులో మూర్ఖుడి పాశవిక చర్యపై గ్రామస్తుల ఆగ్రహం**

**పాల్వంచ, మే 24(మనం న్యూస్):** జగన్నాధపురం గ్రామంలో జరిగిన అమానుష ఘటన సమాజం సిగ్గుతో తలదించుకునేలా చేసింది. జన్మనిచ్చిన తల్లినే కామవాంఛతో చూడటం... చివరకు అత్యాచారానికి పాల్పడటం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. జగన్నాదపురం గ్రామానికి చెందిన బానోత్ పవన్ ఆదివారం తెల్లవారుజామున మద్యం మత్తులో ఇంటికి చేరుకుని, తన కన్న తల్లిపైనే దారుణానికి ఒడిగట్టినట్లు సమాచారం. తల్లి కేకలు వేయడంతో అప్రమత్తమైన స్థానికులు అక్కడికి చేరుకుని నిందితుడిపై మండిపడ్డారు. తల్లిని దేవతగా భావించే భారతీయ సంస్కృతికి మచ్చ తెచ్చేలా ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. మద్యం మత్తు, వికృత మనస్తత్వం మనిషిని ఎంతటి పశువుగా మార్చేస్తుందో ఈ ఘటన మరోసారి బయటపెట్టిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు బానోత్ పవన్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. “కన్న తల్లిపైనే అత్యాచారం చేసే స్థాయికి దిగజారిన నిందితుడికి అత్యంత కఠిన శిక్ష విధించాలి. ఇలాంటి వారిని సమాజంలో తిరగనివ్వకూడదు” అంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కన్నతల్లి పై అఘాయిత్యానికి పాల్పడ్డ కీచక కుమారుడుపై కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.

మనం



# భద్రాచలం

భద్రాచలం - దుమ్ముగూడెం

## భద్రాచలంలో ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

**భద్రాచలం మే 24 (మనం న్యూస్ ):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సి ఏ )ఆధ్వర్యంలో భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలోని చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీలో ఆదివారం ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపును ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్,హెచ్సీఏ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి చెరుకూరి వెంకట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన యువ క్రీడాకారులు క్రికెట్లో ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన శిక్షణతో వారు ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు.హెచ్సీఏ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి చెరుకూరి వెంకట్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రికెట్ ప్రతిభను వెలికితీసి ఉన్నత శిఖరాలకు చేర్చడమే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లక్ష్యమని తెలిపారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంత యువత ఈ ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు.ఈ ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపులో కోచ్లుగా కుప్పాల చరణ్ తేజ, రవితేజ, శ్రీకాంత్ శిక్షణ అందిస్తారని తెలిపారు.కార్యక్రమ ప్రారంభానికి గుర్తుగా ఐటీడీఏ పీవో రాహుల్ బ్యాటింగ్ చేయగా, హెచ్సీఏ కార్యదర్శి చెరుకూరి వెంకట్ బౌలింగ్ చేసి క్యాంపును అధికారికంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, తల్లిదండ్రులు, అకాడమీ ప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



## గిరిజన దర్బార్ కు సకాలంలో హాజరు కావాలి: పీవో

**భద్రాచలం, మే 24 (మనం న్యూస్):** భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని ఆయన పేర్కొన్నారు.సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.



## అంబేద్కర్ విగ్రహం రక్షణ గోడ ధ్వంసం

### కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### ఎస్టీ ఎస్సీ బీసీ మైనార్టీ జేఏసీ నాయకులు డిమాండ్

**భద్రాచలం, మే 24( మనం న్యూస్):** భద్రాచలం పట్టణం నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ విగ్రహానికి రక్షణ కరువైంది .శనివారం ఉదయం ఒక గుర్తు తెలియని వాహనం అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న రక్షణ గోడను ఢీకొని ధ్వంసం చేసింది. దీని మీద భద్రాచలం ఎస్టీ ,ఎస్సీ ,బీసీ ,మైనారిటీ జేఏసీ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద మండుటెండలో నిరసన వ్యక్తం చేశారు. రక్షణ గోడను ధ్వంసం చేసిన డ్రైవరు, వాహనం మీద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముర్ల రమేష్, ఈటె రాజేశ్వరరావు, పలాంటి రాజేశ్వరరావు, భీమపాక పెద్దరాజు,తమ్ముళ్ల వెంకటేశ్వరరావు (టి వి), ఇమ్మంది నాగేశ్వరావు, పేరాల నాగరాజు, ముద్ద పిచ్చయ్య, దాసరి శేఖర్, నాగార్జున, 10వ వార్డు మెంబర్ నిట్టా రాజు, కేసు పాక వెంకటేశ్వర్లు, సోందే రవికుమార్, కేసుపాక కృష్ణ పాల్గొన్నారు.



# ఘనంగా గోదావరి నది హారతి

**భద్రాచలం, మే 24( మనం న్యూస్ ):** భద్రాచలం దివ్య క్షేత్రంలోని పుణ్య గోదావరి స్నాన ఘట్టాల వద్ద నిర్వహిస్తున్న గోదావరి హారతి పరాభవ నామ సంవత్సరం అధిక జేష్ఠ మాసం శుక్లపక్షం అష్టమి మాసంలోకి ప్రవేశించి, భక్తుల సంఖ్యను మరింత పెంచుతుందని పురోహితులు రామవజల రవికుమార్ అన్నారు.ఆదివారం నాడు సాయంత్రం శ్రీ సీతారామచంద్రస్వామి దివ్య క్షేత్రం భద్రాచలంలోని గోదావరి కరకట్ట ప్రదేశాలలో జరిగిన నదీహారతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ అధిక జేష్ట మాసం శుక్లపక్షం అష్టమి రోజు చాలా విశేషమైనదని, అధిక జేష్ట మాసం అష్టమి ఆదివారం దివ్య క్షేత్రం భద్రాద్రిలో నిర్వహిస్తున్న గోదావరి హారతి కూడా చాలా విశిష్టమైనదని ఆయన అన్నారు. అనంతరం పురోహితులు గోదావరి హారతి విశేషాలను, అధిక జ్యేష్ట మాసం అష్టమి మాసానికి సంబంధించిన విశిష్టతను భక్తులకు తెలిపి, గణపతి పూజ, దీపోత్సవం భక్తులచే సృష్టింప చేసి, పూజా ద్రవ్యాలతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేసి లోక కళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహత్కార్యములో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామానుగ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందుతున్నారని ఆయన అన్నారు. అనంతరం శాంతి మంత్ర పఠనం జరిపి రామ్ కుమార్, లక్ష్మి దంపతులు ప్రసాదం పంపిణీ చేయడం జరిగినదని, నదిహారతి కార్యక్రమానికి పూజా సామాగ్రి రెడీమేడ్ బట్టల షాప్ అసోసియేషన్ భద్రాచలం వారు అందించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సురేష్ శర్మ, వీరభద్ర శర్మ, రామాచార్యులు, సత్య ప్రసాద్ శర్మ, కృష్ణ శర్మ, తేజ శర్మ, సుబ్రహ్మణ్యం శర్మ చార్యులు, స్వచ్ఛంద సంస్థలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఆదివాసి గ్రామం మట్టి గూడానికి విద్యుత్ సమస్య పరిష్కరించాలి

**దుమ్ముగూడెం, మే 24 (మనం న్యూస్ ):** సంవత్సరాల తరబడి కాళ్లకి చెప్పులు అరిగేలా తిరిగినా బట్టి గూడెం ఆదివాసీ గ్రామానికి కరెంటు సమస్య పరిష్కారం అవ్వలేదని ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులు ఆ గ్రామానికి వెంటనే విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపందా పేర్కొంది. 2022 నుంచి ఈరోజు వరకు జలకం వారి గుంపులో 600 మీటర్ల సర్వీస్ వైరు మీద నాలుగు కరెంటు మీటర్లు నడుస్తున్నాయి ఇది అధికారుల నిర్లక్ష్య తీరు అదే సర్వీస్ మీద వన్ ఫ్లస్ మోటర్ గాలి దుమ్ము వస్తే చీకట్లో చంటి పిల్లలతో ఇబ్బందులు తప్పవా ఏ ఆదివాసీలు అంటే అంత అలుసా ప్రభుత్వాలకు బట్టి గూడెం గ్రామంలో ఉన్న కరెంటు సమస్యను అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ దుమ్ముగూడెం మండల కార్యదర్శి సాయన్న డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బట్టి గూడెం గ్రామంలో ఆదివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ ఎండాకాలం గాలి దుమారం వచ్చిందంటే గ్రామంలో విద్యుత్ లేకుండా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. కమలాపురం నుండి దుమ్ముగూడెం కమలాపురం పెద్దార్లగూడెం గ్రామాల వైపు వాహనాలు రాత్రిపూట విద్యుత్ సర్వీస్ వైర్లను లాక్కొని వెళ్ళిపోతున్నాయని దీంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వరసాకాలం సమీపిస్తున్నందున విద్యుత్ శాఖ అధికారులు మిడిల్ పోల్స్, గృహాలకు దూరంగా ఉన్న విద్యుత్తు లైన్ కి కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని, విద్యుత్ మీటర్లేని ఆదివాసి గిరిజనులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జలకం పస్సయ్య అంజి బుజ్జి బాబు వీరయ్య, కల్లూరి చిన్నారావు కుంజా ముత్తయ్య ఉబ్బ వీరయ్య జలకం వెంకయ్య జలకం శ్రీను జలకం సుబ్బారావు జలకం సోమయ్య కల్లూరు శ్రీను జలకం పెద్ద రమేష్ జలకం గణేష్ కల్లూరి సీతారాములు ఎడవల్లి మంగమ్మ జలకం చంద్రయ్య జలకం పెద్ద వీరయ్య జలకం రాజేష్ జలకం రమేష్ కొరసా దుర్గారావు మల్లం రాజులు తదితరులు పాల్గొన్నారు.



## ఏజెన్సీ యువత ఉన్నత స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

### ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆకాంక్ష

**దుమ్ముగూడెం మే 24 ( మనం న్యూస్ ):** ఏజెన్సీ ప్రాంతంలో ప్రతిభ, నైపుణ్యం గల క్రీడాకారులు ఎందరో ఉన్నారని వారంతా ఉన్నత స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆకాంక్షించారు. ఆదివారం దుమ్ముగూడెం మండలం మూలకపాడు క్రీడ మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో రఘు 11 వర్సెస్ బిఎస్పి 11 మధ్య జరిగిన ఉత్కంట మ్యాచులో రఘు 11 టీం మొదటి విజేతగా నిలవగా ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్ల వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విన్నర్ గా నిలిచిన రఘు 11 టీం కి, రెండో విజేతగా నిలిచిన బిఎస్పి లెవెన్ టీం క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ములకపాడులో ఏర్పాటు చేసిన క్రీడా మైదానం జిమ్, ఇండోర్ స్టేడియంలో యువత క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. క్రీడలలో రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయిలకు ఎదిగిన క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెల్లం హరికృష్ణ జిల్లా సీనియర్ నాయకులు లంక శ్రీనివాసరావు ముర్రం వీరభద్రం, దిశ కమిటీ సభ్యులు సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ, దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రుక్మాకర్ రెడ్డి, పర్ణశాల ఉపసర్పంచ్ వాగె శ్రీధర్ సీనియర్ క్రీడాకారులు క్రీడాకారులు అభిమానులు పాల్గొన్నారు.



# సమయపాలన పాటిస్తాం..

**–అదనపు సర్వీలను ఏర్పాటు చేస్తాం**
**–వారంలోగా త్రాగునీటి సమస్య పరిష్కరిస్తాం**
**–తాత్కాలికంగా వాటర్ కూలర్ ఏర్పాటు**
**కూకట్పల్లి, గుంటూరు సర్వీస్ లను ప్రారంభిస్తాం**
**–భద్రాచలం ఆర్టీసి డిపోమేజర్ జంగయ్య**
**– 'మనం' వార్తా కథనానికి స్పందన**




ఇదేం విచిత్రం డిఎం గారూ..





**చర్ల, మే 24 (మనం న్యూస్) :** ఆర్టీసి బస్ సర్వీస్ లను నడపడంలో సమయపాలన పాటిస్తామని, పరిస్థితులకు అనుగుణంగా భద్రాచలం – వెంకటాపురం మార్గంలో అదనపు బస్ సర్వీస్ లను నడుపుతామని భద్రాచలం ఆర్టీసి డిపోమేనేజర్ సి జంగయ్య అన్నారు. వెంకటాపురం మార్గంలో బస్ సర్వీస్ లను ఆకస్మికంగా రద్దు చేయడంతో పాటు బస్టాండ్ లో ఆర్ వో ప్లాంట్ మరమ్మత్తులకు గురయి ప్రయాణికులు త్రాగునీరు దొరక్క ఇబ్బంది పడుతున్న వైనంపై ఆదివారం 'మనం' దినపత్రికలో ప్రచురితమైన 'ఇదేం వివక్ష డిఎం గారూ' శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి ఆర్టీసి ఖమ్మం రీజనల్ మేనేజర్ సరిరాం స్పందించారు. వెంటనే ఈ విషయమై తగు చర్యలు తీసులోవాలని భద్రాచలం డిపో మేనేజర్ జంగయ్యను ఆదేసించారు. దీంతో ఆయన సిబ్బందితో కలసి భద్రాచలం – వెంకటాపురం మార్గంలో రాకపోకలు సాగించే బస్ లను తనిఖీ చేసి సమయపాలన పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. చర్ల బస్టాండ్ కు చేరుకొని పరిశర ప్రాంతాలను పరిశీలించి పారిశుధ్య పనులను, చెత్తను తొలగించాలని సిబ్బందిని ఆదేసించారు. మరమ్మత్తులకు గురయిన ఆర్వో ప్లాంట్ ను వెంటనే మరమ్మత్తులు చేయిస్తామని, అంత వరకు తాత్కాలికంగా వాటర్ కూలర్ ద్వారా ప్రయాణికుల దాహార్తిని తీరుస్తామని వెల్లడించారు. గత రెండు రోజులుగా డ్రైవర్ల రిక్రూట్ మెంట్ కారణంగా సర్వీస్ ల నిర్వహణలో అంతరాయం కలిగిందని, ఇకపై సర్వీస్ లను సక్రమంగా నడిపేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అద్దె బస్ డ్రైవర్లు ఎండ తీవ్రత కారణంగా అకస్మికంగా సెలవు పెట్టడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఇకపై ఇటువంటి సందర్భంలో ఆర్టీసి బస్ లను నడుపుతామని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా అవసరమైతే అదనపు సర్వీస్ లను నడుపుతామని వెల్లడించారు. ఈ మార్గంలో ఇసుక లారీల కారణంగా ఒక్కోసారి సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయని వివరించారు. బస్ లను సమయానికి అనుగుణంగా నడిపేలే డ్రైవర్లకు ఆదేశాల ఇస్తామన్నారు. చర్లలో కంట్రోలర్ ను ఏర్పాటు చేసి సమయానుకూలంగా బస్ లు నడిచేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఉన్నతాదికారుల దృష్టికి తీసుకువెల్లి త్వరలో కూకట్పల్లి, గుంటూరు బస్ సర్వీస్ లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డిసి వెంకన్న, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మనం



# చర్ల

చర్ల మేజర్ పంచాయతీ - చర్ల మండలం

## 5 కేజీల ఐఈడీ నిర్వీర్యం



**చర్ల, మే 24 (మనం న్యూస్) :** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లాలో భద్రతా బలగాలు అప్రమత్తంగా వ్యవహరించి భారీ ప్రమాదాన్ని తప్పించాయి. బర్సూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిద్పాల్ అటవీ ప్రాంతంలో 5 కేజీల ప్రెషర్ కుక్కర్ ఐఈడీని గుర్తించి నిర్వీర్యం చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు హిద్పాల్ పరిసర కొండలు, దట్టమైన అటవీ ప్రాంత్చలలో గాలింపు చర్యలు చేపట్టేందుకు సీఆర్పీఎఫ్ 195 బెటాలియన్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ బృందాన్ని రంగంలోకి దించారు. ఈ ఆపరేషన్ను సెకండ్ ఇన్ కమాండ్ ఆఫీసర్ విక్రాంత్ వర్మ మార్గదర్శకత్వంలో, అసిస్టెంట్ కమాండెంట్ సంజీవ్ కుమార్ యాదవ్ నేతృత్వంలో జిల్లా పోలీసులతో కలిసి గాలింపు చేస్తుండగా అటవీ ప్రాంతంలో భద్రతా సిబ్బందికి అనుమానాస్పద వస్తువు కనిపించింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ను సంఘటన స్థలానికి పిలిపించారు. బీడీఎస్ బృందం పరిశీలించి అది సుమారు 5 కిలోల ప్రెషర్ కుక్కర్ ఐఈడీగా గుర్తించారు. భద్రతా దళాలకు నష్టం కలిగించడం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం లక్ష్యంగా నక్సలైట్లు ఈ పేలుడు పదార్థాన్ని అటవీ ప్రాంతంలో అమర్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం సాంకేతిక పద్ధతులను ఉపయోగించి బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ ఆ ఐఈడీని అక్కడికక్కడే సురక్షితంగా నిర్వీర్యం చేసి ధ్వంసం చేసింది. భద్రతా దళాల అప్రమత్తత, వేగవంతమైన చర్యలతో భారీ ప్రాణనష్టం తప్పినట్లు పోసీస్ అధికారులు వెల్లడించారు.ఆపరేషన్ అనంతరం పరిసర ప్రాంతాల్లో అదనపు గాలింపు చర్యలు కూడా చేపట్టారు. ఆపరేషన్ విజయవంతంగా ముగిసిన అనంతరం భద్రతా బలగాలు సురక్షితంగా బేస్ క్యాంపులకు చేరుకున్నాయి. దంతేవాడ జిల్లా పోలీసులు భద్రతా దళాలు ఈ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం ఆపరేషన్లు కొనసాగిస్తున్నాయి అని ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు, పేలుడు పదార్థాలు, మావోయిస్ట్ కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా భద్రతా దళాలకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

## గుంతలను పూడ్చరూ...

### దేవరాపల్లి వద్ద రహదారిపై భారీ గుంతలు
### వెట్ మిక్స్ పోసి నెల దాటినా గోతులు పూడ్చని వైనం
### ఇబ్బందులు పడుతున్న వాహనదారులు





**చర్ల, మే 24 (మనం న్యూస్) :** రోడ్లు భవనాల శాఖ అదికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం దేవరాపల్లి గ్రామ సమీపంలోని ప్రదాన రహదారిపై పడిన గుంతలు. భారీ వాహనాల రాకపోకలతో మండలంలోని దేవరాపల్లి గ్రామం సమీపంలోని జోడిచిలుకల వాగు వద్ద చర్ల. భద్రాచలం ప్రదాన రహదారి పూర్తిగా ద్వంసమైంది. భారీ గుంతలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. దీంతో సదరు గోతులను పూడ్చేందుకు గాను ఆర్ అండి బి శాఖ అదికారులు వెట్ మిక్స్ కుప్పగా పోసారు. పోసిన వెట్ మిక్స్ కుప్ప ఇన్నాల్లయినా సదిరించక పోవడం ఆ శాఖ అదికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. రహదారిపై రెండు చోట్ల భారీ గుంతల కారణంగా వాహన దారులు నానా అవస్దలు పడుతున్నారు. గోతులలో పడిన వాహనాలు మరమ్మత్తులకు గురవుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరిగి అనేకమంది గాయాలపాలవుతున్నాయి. ఇంత జరుగుతున్న రోడ్లు భవనాల శాఖ అదికారులు కనికరం చూపించడం లేదు. ఇటీవల ఆశాఖ డిఈ పదవీ విరమణ పొందడంతో ఇన్ చార్జ్ డిఈ ఇక్కడి బాద్యతలను చూస్తున్నారు. ఆయన ఇక్కడ మొక్కుబడిగా విదులు నిర్వహిస్తుండటంతో రహదారి సమస్యలు పరిష్కారం కావడం లేదు. సంబంధిత శాఖ ఏఈ ఉన్నా ఇటువంటి చిన్న సమస్యలను సైతం పరిష్కరించక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికయినా సంబంధిత అదికారులు స్పందించి వెట్ మిక్స్ తో గోతులు పూడ్చి తాత్కాలికంగా మరమ్మత్తులు చేసి తమ ప్రాణాలను కాపాడాలని వాహనదారులు కోరుతున్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**చర్ల, మే 24 (మనం న్యూస్) :** మండలంలోని కోరెగడ్డ లంక చేలలో పూర్తిగా కుల్లిపోయిన స్దితిలో ఒక చెట్టుక్రింద గుర్తు తెలియని పురష మృతదేహం లభ్యమయింది. వారం రోజుల క్రితం ఎండ తీవ్రత కారణంగా మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఎండ తీవ్రత కారణంగా శరీరం నల్లగా మారి గుర్తుపట్టలేని స్దితిలో ఉంది. సమాచారం అందుకున్న సిఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి సిబ్బందితో మండుటెండలో కోరెగడ్డ చేరుకొని పంచనామా చేసారు. మృతదేహం ఫోటోలను తీసి గుర్తించేందుకు గాను వివిద పోలీస్ స్టేషన్ లకు పంపారు. అనంతరం గోదావరిలో ఖననం చేసారు.



## ఉపాధి హామీ పనుల పరిశీలన



**చర్ల, మే 24 (మనం న్యూస్) :** మండలంలోని లక్ష్మీకాలని గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాదిహామీ పనులను మండల పరిషత్ అభివృద్ధి అదికారి కనపర్తి ఈదయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పని జరిగే సమయంలో కార్మికులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మొబైల్ ద్వారా హాజరు పంపే విదానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగ మహాలక్ష్మి, ఈజిఎస్ ఏపివో సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి రవి, ఫీల్ అసిస్టెంట్ లు కారం శ్రీనివాసరావు, మేట్లు పాల్గొన్నారు.

## ఈపీఎఫ్ డబ్బులను ఖాతాలో జమ చేయాలి

### సింగరేణి కాలరీస్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్
### రీజియన్ కార్యదర్శి ఎన్ సంజీవ్

**టేకులపల్లి, మే 24 (మనం న్యూస్) :** ఎల్ఎస్ఎన్ఓబిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఈపీఎఫ్ డబ్బులను వారి ఖాతాలో జమ చేయకుండా. యాజమాన్యం నిర్లక్ష్యాన్ని వహిస్తుందని అట్టి విషయంపై కేఓసి పిఓ గోవిందరావుకు కార్మికుల ఈపీఎఫ్ గురించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు తమ వేతనము నుండి ఈపీఎఫ్ ఎల్ ఎస్ ఎన్ యాజమాన్యం కోత విధిస్తూ వారి ఖాతాలో గత కొన్ని నెలలుగా జమ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఈపీఎఫ్ డబ్బులను కార్మికుల ఖాతాలో జమ చేయని యెడల ఐఎఫ్టియు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరంఇచారు. టెండర్ కాల పరిమితి ఒక నెల కాలం మాత్రమే ఉన్నదని కార్మికులకు రావలసిన ఈపీఎఫ్ బకాయిలను తక్షణమే ఎల్ఎస్ఎన్ యాజమాన్యం చెల్లించే విధంగా, అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఐఎఫ్టియు డివిజన్ కార్యదర్శి డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**అశ్వాపురం, మే 24( మనం న్యూస్ ):** మండలంలోని జగ్గారం, గొందిగూడెం గ్రామ పంచాయతీలలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకొని ఆదివారం గృహప్రవేశాలు చేస్తున్న సందర్భంగా లబ్ధిదారులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. జగ్గారంలో ఆవుల సరిత, తాటి వెంకటమ్మ, గొందిగూడెంలో కొమరం నాగమణి, కంచర్ల దేవి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాల సొంతింటి కల సాకారం అవుతోందని అ పేద ప్రజలు సొంతింటిలో సంతోషంగా జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఓరుగంటి రమేష్ బాబు, ఊసా అనిల్ కుమార్, మాదినేని రాంబాబు, బూరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్ లు యేనిక ఉషారాణి, జిమ్మా ఝాన్సీ, ఉపసర్పంజ్ శీలం సంజీవ రెడ్డి, తూము వీరరాఘవులు, ఆవుల రవి, బరాజు సంపత్, చుంచు ఏకాంబరం, సోడే వెంకటేశ్వర్లు, గుండ్రెడ్డి శ్రీనివాసరెడ్డి, గణపారపు వెంకన్న, గొల్లపల్లి నరేష్,తాటి రాంబాబు , వేముల విజయ్, జిమ్మా జంపయ్య, కంబాల వెంకన్న, బట్టి వెంకన్న, కంబాల వెంకన్న, ఆవుల వెంకన్న, భూక్యా శివ నాయక్, పర్సబోయిన సోమలింగం, తహసిల్దార్ సూర్యప్రకాష్ , ఎంపీడీవో ముత్యాలరావు, హౌసింగ్ ఏఈ పాల్గొన్నారు.

# తుమ్మలచెరువు రెండు తూముల షట్టర్లకు మరమ్మతులు చేయాలి



**అశ్వాపురం, మే 24( మనం న్యూస్):** మండలంలోని మొండికుంట సమీపంలో కాకతీయుల కాలంలో నిర్మించిన సుప్రసిద్ధ సాగునీటి తుమ్మలచెరువు రెండు తూముల షట్టర్లను వెంటనే రిపేరు చేయాలని సిపిఎం,తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు . సిపిఎం,రైతు సంఘం నాయకులు ఆదివారం తుమ్మలచెరువును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వరి పంటకు కేంద్ర బిందువుగా వున్న చెరువుకు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నా రు. అధికారుల నిర్లక్ష్యంతో రెండు సంవత్సరాలుగా చెరువుకు ఉన్న పెద్ద తూము,చిన్న తూముల వద్ద సంక్లిష్ట సమస్యల వలన రైతాంగం అవస్థలు పడుతూ కాలం వెళ్ళదీశారన్నారు. ప్రతి సంవత్సరం నీటి సామర్థ్యం 24 అడుగులు దాటి చెరువు నిండుకుండలా వారి తూములపై నుండి అలుగు పారుతూ,చెరువు చుట్టూ ఉన్న కట్టలు దెబ్బతింటాయేమోనని ప్రజలు భయపడుతూ చెరువును రక్షించుకుంటు న్నారన్నారు. రెండు సంవత్సరాలుగా తూముల షట్టర్లు బిగుసుకుపోయి,పైకి క్రిందికి ఆడక పోవడం వలన రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుతం రెండు పంటల కాలం పూర్తయినందున, ఇరిగేషన్ అధికారులు తొలకరి లోపు షట్టర్ల రిపేరు, కాలువల పూడికతీత పనులు పూర్తిచేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షులు బద్దం శంబిరెడ్డి,మండల కమిటీ సభ్యులు మంగి వెంకటరమణ,ఆవుల సుధాకర్,పినికేసి సుధాకర్ రెడ్డి, సర్గం వీరరాఘవులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దండి రాములు పాల్గొన్నారు.

# కుటుంబాన్ని వెంటాడిన దురదృష్టం

### కుమారుడు మృతి..

### కోమాలో తల్లిదండ్రులు

### గ్రామంలో అలుముకున్న విషాద ఛాయలు...





**కరకగూడెం, మే 24(మనం న్యూస్):** కరకగూడెం గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆడెపు సతీష్ కుటుంబాన్ని వరుస ప్రమాదాలు వెంటాడడంతో గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది.ఇప్పటికే గతంలో జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆడెపు సతీష్, మెరుగైన వైద్యం కోసం తన భార్య, కుమారుడు మనోహర్ తోకలిసి ఆటోలో భద్రాచలం వెళ్తుండగా సారపాక సమీపంలో మరో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు.గాయపడిన సతీష్, అతని భార్య భద్రాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోమాలో ఉన్నారు. కుమారుడు మనోహర్ను మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు మరణించిన విషయం కూడా ప్రస్తుతం కోమాలో ఉన్న తల్లిదండ్రులకు తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ఘటనతో గ్రామంలో విషాదశాయలు అలుముకున్నాయి. గ్రామస్థులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నారు.



# మనం



# మణుగూరు

మణుగూరు మున్సిపాలిటీ - మణుగూరు మండలం - అశ్వాపురం



# రోడ్డు భద్రతకు బుడుగు బజార్ యువత చొరవ

**అశ్వాపురం, మే 24( మనం న్యూస్ ):** మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి కార్యాలయం ముందు ఉన్న రోడ్డు డివైడర్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో బుడుగు బజార్ యువత ఆదివారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సిగ్నల్ రేడియం స్టిక్కరింగ్తో కూడిన పోల్ ను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో వాహనదారులకు డివైడర్ స్పష్టంగా కనిపించేలా ఈ ఏర్పాట్లు చేసినట్లు యువత తెలిపారు. ఇటీవల అక్కడ వరుసగా ప్రమాదాలు చోటుచేసుకోవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొం ది. ఈ నేపథ్యంలో యువత సామాజిక బాధ్యతతో స్పందించి స్వంత ఖర్చులతో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడం స్థానికుల ప్రశంసలు అందుకుంది. రోడ్డు భద్రతపై యువత చూపిన చొరవను పలువురు అభినందించారు.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయబద్ధమైన డీలిమిటేషన్ జరగాలి

### ఖమ్మం నియోజకవర్గ డీలిమిటేష్న రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



**ఖమ్మం, మే 24(మనం న్యూస్):** నగరంలోని బంజారా భవన్లో ఖమ్మం జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల డీలిమిటేషన్ అంశంపై విస్తృత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఎల్.జేఏసి రాష్ట్ర సమన్వకర్త భూక్యా శోభన్ నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ భవిష్యత్ డీలిమిటేషన్ ప్రక్రియ ప్రజల ప్రయోజనాలు , భౌగోళిక అనుసంధానం , రవాణా సౌకర్యాలు , పరిపాలనా సౌలభ్యం, సామాజిక సమతౌల్యాన్ని దృష్టిలో పెట్టుకొని జరగాలని అభిప్రాయపడ్డారు . ముఖ్యంగా సమీప మండలాలను కలిపి సహజమైన నియోజకవర్గాల రూపకల్పన చేయాలని , రాజకీయ లేదా కుల ఆధారిత విభజనలతో ప్రజలను విడదీయడానికి చేసే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు . ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు చేపడతామని , ఖమ్మం జిల్లా ప్రజల హక్కుల సాధన వరకు తమ పోరాటం కొనసాగుతుందని వక్తలు హెచ్చరించారు . పలువురు నాయకులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో పెరుగుతున్న జనాభా , గ్రామీణ , పట్టణ విస్తరణ , రహదారి అనుసంధానం , ప్రజాప్రతినిధుల అందుబాటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని శాస్త్రీయ పద్ధతిలో డీలిమిటేషన్ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జరుపల భీముడు నాయక్ , ప్రధాన కార్యదర్శి బస్కి నాయక్ , జిల్లా అధ్యక్షులు ధరావత్ రామ్మూర్తి నాయక్ , ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు కిషన్ నాయక్ , బానోతు వీరు నాయక్ , భూక్య రాంబాబు , నెహ్రూ నాయక్ , మంచా నాయక్ , మోతిలాల్ నాయక్ , చందు నాయక్ , రామ్మూర్తి నాయక్ (ఆర్టిసి) , బానోతు తారాబాయి , కిమ్ నాయక్ , రంజిత్ నాయక్ , శ్రీదేవి , సాయి నాయక్ , విద్యార్థి సంఘం నాయకుడు మంగిలాల్ జాదవ్ , మహేష్ నాయక్ తదితర అన్ని సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు .